మట్లాడలేకపోయాడు రామారావు. ఆ రాత్రి సరిగ్గా నిద్ర కూడా పట్టలేదు. తను విన్నమాటలే మనసులో పదేపదే మెదులుతున్నాయి. తను అందరికీ సహాయపడుతున్నాడని అనుకుంటున్నాడు గానీ వాళ్లల్లో ఇలాంటి తలంపు ఉంటుందని కలలో కూడా ఊహించలేదతను. అపాత్రదానంలాగే ఇలాంటి సహాయం పనికిరాదని తెలుసుకున్నాడతను.

-డి.వి.డి. ప్రసాద్ (ఒరిస్సా)

# క్లోజ్‌ఫ్రెండ్

**పుట్టి బుద్ధెరిగాక ఇంత పెద్ద సమస్య ఎప్పుడూ ఎదురుకాలేదు విమలకి. పూలపడవలా సాగిపోతున్న తన సంసారం సుడిగుండంలో చిక్కుకున్నట్టుంది ఆమెకి. కాలుగాలిన పిల్లిలా ఇల్లంతా తిరుగుతోంది. దేనిమీదా మనస్సు నిలవడంలేదు.**

ఆరోజు ఉదయం యధావిధిగా భర్త ఆఫీసుకీ, కొడుకు స్కూల్‌కి వెళ్ళాక ఇంటిపనులు చేసుకుంటున్న ఆమెకి కొడుకు స్కూల్‌లో పనిచేసే ప్యూన్ రాక ఆశ్చర్యం కలిగించింది. ప్రిన్సిపాల్ ఇవ్వమన్నారని ఓ కవర్ ఆమె చేతిలో పెట్టి వెళ్ళిపోయాడతను. విప్పి చదివిన ఆమెకి తల తిరగినట్టయింది. ఆమె కొడుకు రవి వారం రోజులుగా స్కూల్‌కి రావడం లేదనీ, మర్నాడు వచ్చి ప్రిన్సిపాల్‌ని కలుసుకోమనీ దాని సారాంశం.

'మరి స్కూల్ టైంకి రెడీ అయి వారంరోజులుగా వీడు ఎక్కడికి వెళ్తున్నట్టు?' అయోమయంగా ఉంది ఆమెకి. వెంటనే భర్త రామం ఆఫీసుకి ఫోన్ చేసి చెప్పింది. ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ జరుగుతోందనీ, సాయంత్రం త్వరగా వస్తాను కంగారు పడొద్దనీ చెప్పాడతను.

సాయంత్రం మామూలుగానే స్కూల్ వదిలే టైంకి ఇంటికి వచ్చి బట్టలు మార్చుకుని ఆడుకునేందుకు వెళ్ళిపోయాడు రవి. రామం ఆఫీసు నుంచి వచ్చాక భార్యాభర్తలిద్దరూ ఆలోచిస్తూ కూర్చున్నారు చాలాసేపు. నాలుగో తరగతి వరకూ ఇంటి దగ్గరలోనే ఉన్న స్కూల్‌లో చదివాడు రవి. ఈ సంవత్సరమే ఐదో తరగతిలో దూరంగా ఉన్న మంచి స్కూల్‌లో చేర్చారు. మరి ఇంతలోనే ఏమయినట్టు? మనసు పరిపరివిధాల పోతోంది ఇద్దరికీ. 'తమ పెంపకంలో ఏం లోటు జరిగింది? డ్రగ్స్ ట్రాఫికింగ్‌లో చిన్నపిల్లలను వాడుకుంటున్నారని పేపర్లో చదివారు. కొంపదీసి అలాంటి వాటిల్లో చిక్కుకోలేదు కదా వీడు?' గుండె గుభేలుమంది.

మర్నాడు స్కూల్‌కని బయలుదేరిన రవిని వాడికి తెలియకుండా వెంబడించాడు రామం. రవి బస్ దిగి ప్రక్కనే ఉన్న పార్క్‌లోకెళ్ళి అక్కడ పిల్లలు ఆడుకుంటుంటే చూస్తూ అక్కడే బెంచిమీద కూర్చున్నాడు. కొంతసేపు వాడిని గమనించాక దగ్గరికి వెళ్ళి "పద" అన్నాడు రామం. మాట్లాడకుండా తండ్రి వెనకాలే ఇంటికి వచ్చాడు రవి. వాడి ముఖంలో భయానికి బదులు ఒక విధమైన రిలీఫ్ చూసి ఆశ్చర్యపోయాడు రామం.

ఇంటికి వచ్చాక వాడిని ఎన్ని ప్రశ్నలు వేసినా మౌనమే సమాధానమైంది. సాయంత్రం వెళ్ళి ప్రిన్సిపాల్‌ని కలుసుకున్నారు ఇద్దరూ. ఆయనకి నమస్కరించి కూర్చున్నారు.

వీళ్ల ముఖాల్లో దైన్యం చూసి జాలేసింది ఆయనకి. ఆయన ముఖంలో చిరునవ్వు చూసి ధైర్యం వచ్చింది వీళ్లకి. రవి స్కూల్‌కి రావడం లేదన్న విషయం వీళ్లకి తెలియదని తెలుసుకున్నారాయన.

నెల్లాళ్ళ క్రితం ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇచ్చారనీ రవి ఒక సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయ్యాడనీ విని ఆశ్చర్యపోయారు విమలా, రామం. ఇచ్చినవారం రోజులదాకా రిపోర్ట్ మీద పేరెంట్స్ సంతకం చేయించి తీసుకురాలేదు రవి. తర్వాత రిపోర్ట్ పోయిందని చెప్పాడు. డూప్లికేట్ రిపోర్ట్ ఇచ్చారు. అది ఇచ్చిన వారం తర్వాత స్కూల్‌కి రావడం మానేశాడు. అదీ విషయం.



"మీది అన్యోన్య దాంపత్యమనుకుంటాను?" ఆయన మాట విని ఏంచెప్పాలో తెలియక మౌనంగా ఉండిపోయారు.

ఆయనే మళ్ళీ అన్నారు "తను ఒక సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయిన విషయం మీకు బాధ కలిగిస్తుందనీ, ఏ ఒకరికి చెప్పినా ఇద్దరూ కలిసి తనని దండిస్తారనీ భయపడ్డాడు రవి. తన సమస్య ఎవరికీ చెప్పుకోలేక తన చిన్ని బుర్రకి తట్టినట్టు చేశాడు. పూర్ ఛైల్డ్"

ఆయన ఏం చెప్తారోనని ఆత్రంగా వింటున్నారు.

"నా స్వానుభవంతో మీకో సలహా ఇస్తాను. అది పాటిస్తే మీకు ఇంక ఇలాంటి సమస్యలు రావు"

"మీరిద్దరూ ఒకే బాట ఒకే మాటలా కాకుండా మీలో ఒకరో అది తల్లి అయితే మరీ మంచిది. మీ బాబుకి క్లోజ్ అవ్వాలి. వాడికి ఏ సమస్య, కష్టం వచ్చినా మీతో పంచుకోగలిగే విశ్వాసాన్నీ, దారి చూపించగలరనే ధైర్యాన్ని వాడిలో కలిగించగలగాలి. వాడి చిన్న మనసు విప్పి మీతో చెప్పుకునే అవకాశాన్ని కల్గించాలి. అలాంటి అవకాశాలు లేకనే ఈ మధ్య చాలా మంది చిన్నారులు చిన్నచిన్న కారణాల దగ్గర్నుంచి పరీక్ష ఫెయిలయిన కారణాలవరకూ కారణంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తల్లిదండ్రులలో ఏ ఒకరితోనైనా సాన్నిహిత్యం ఉన్న పిల్లలు అయితే అలాంటి చర్యకు పూనుకోరు.

ఇంకా మీరు అదృష్టవంతులనే అనుకోవాలి. పసివయసులోనే ఈ సమస్య వచ్చింది కనుక చక్కదిద్దుకోవడానికి అవకాశం ఉంది. ఇదే టీనేజ్ పిల్లలయితే ఏమైనా చేస్తారు. అందుచేత ఇకపై మీ బాబుకి మీరు క్లోజ్‌ఫ్రెండ్‌లా మెలగాలి" విమలని చూస్తూ అన్నారాయన.

ఆయనకి నమస్కరించి సెలవు తీసుకుని తేలికైన మనస్సులతో ఇంటిదారి పట్టారా దంపతులు. అప్పటినుంచీ ఆయన సలహాని అక్షరాలా అమలులో పెట్టారు కూడా.

మూడు నెలల తరువాత స్కూల్‌నించి వచ్చిన రవి ప్రోగ్రెస్ రిపోర్ట్ తల్లి చేతికిచ్చి నాన్నగారి చేత సంతకం పెట్టించమ్మా అని చెప్పి ఆడుకునేందుకు వెళ్లిపోయాడు నిశ్చింతగా.

కొడుకులో వచ్చిన మార్పునీ, గతంలోని చేదు అనుభవాన్నీ తలచుకుంది విమల. తన సంసారం మళ్లీ దారిలో పడడానికి కారణమైన ప్రిన్సిపాల్‌కి మనసులోనే కృతజ్ఞత తెలుపుకుంది.

రవికి కావలసిన ప్రతి చిన్న అవసరానికీ కొడుకుతో కలిసి భర్తకి టెండర్ పెట్టేదీ తనే. ఆ టెండర్‌ని భర్త రామంతో కలిసి రహస్యంగా మంజూరు చేయించేది తనే. పిల్లలకి జ్ఞానం వచ్చి జీవితంలో సెటిలయ్యేదాకా తనకీ డబుల్‌రోల్ తప్పదంటూ తృప్తిగా నవ్వుకుంది విమల.

-సత్య (హైదరాబాద్)